నమస్తే తెలంగాణ
# కరీంనగర్
5 | కరీంనగర్, బుధవారం 10 జనవరి 2024 | KARIMNAGAR

## 15 నుంచి వస్త్ర పరిశ్రమ బంద్


విలేకరులతో మాట్లాడుతున్న సంఘం నాయకులు

రాజన్న సిరిసిల్ల, జనవరి 9 (నమస్తే తెలంగాణ) : ఈ నెల 15 నుంచి వస్త్ర పరిశ్రమ బంద్ పాటిస్తున్నట్లు పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తి దారుల సంఘం అధ్యక్షుడు మండల సత్యం ప్రకటించారు. పాలిస్టర్ వస్త్ర ఉత్పిత్తిదారుల సంఘ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సిరిసిల్లలో తయారైన పాలిస్టర్ వస్త్రాలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర రాకపోవడంతో నిల్వాలు పేరుకు పోయాయన్నారు. దేశ వ్యాప్తంగా మాంద్యం నెలకొన్న కారణంగా నిరవధికంగా బంద్‌పెడుతున్నట్లు చెప్పారు. ఆసాములు, కార్మికులు అనుబంధ పరిశ్రమల సభ్యులు సహకరించాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యాక్షుడు బూట్ల నవీన్ కుమార్, కార్యదర్శి వెల్దండి దేవదాస్, సహాయ కార్యదర్శి పోరండ్ల మల్లేశం, శ్రీరాం సత్యం పాల్గొన్నారు.

## రైతు నేస్తాలు.. స్వాగత తోరణాలు



పెద్దపల్లి సేద్యపు ఖిల్లా. చరిత్రకు సాక్ష్యంగా.. చారిత్రక ప్రాంతాలకు కేంద్రంగా నిలుస్తున్నది. ఈ క్రమంలో కనుమరుగైపోతున్న చారిత్రక సంపద, సంస్కృతీ సంప్రదాయాలకు పెద్దపల్లి కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఇప్పటికే పురాతన వస్తువులు, జిల్లా చారిత్రక ప్రాంతాల చిత్రాలు, విశేషాలతో మ్యూజియం ఏర్పాటు చేసిన ఆయన, కలెక్టరేట్ కార్యాలయం ప్రధాన ద్వారానికి ఇరువైపులా రైతు నేస్తాలు కచ్చురాలు (ఎడ్ల బండ్లను) రెండింటిని ఏర్పాటు చేయించగా, వచ్చీపోయేవారికి స్వాగతం పలుకుతున్నాయి. కలెక్టరేట్‌కు వచ్చే వారిని ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.
– పెద్దపల్లి, జనవరి 9 (నమస్తే తెలంగాణ)


ప్రధాన కూరగాయల మార్కెట్ పక్క గల్లీలో..


పండ్ల మార్కెట్ పక్క గల్లీలో..


మార్కెట్ మూల వద్ద..


ప్రధాన కూరగాయల మార్కెట్‌లో


చేపలమార్కెట్ మూలవద్ద..

## టవర్ పరిధిలో ట్రాఫిక్ తిప్పలు

### ఫుట్‌పాత్ కబ్జా
### రోడ్లపై పార్కింగ్


షాపు ఎదుట ఫుట్‌పాత్‌ను ఆక్రమించి..


ప్రధాన కూరగాయల మార్కెట్ పక్కన కంగన్‌హాల్ గల్లీలో..

కరీంనగర్ టవర్ పరిధిలో వ్యాపారాలు నిత్యం కిటకిటలాడుతాయి. మార్కెట్ ఏరియా, అన్నపూర్ణ కాంప్లెక్సు, ప్రకాశంగంజ్, శాస్త్రిరోడ్, తిలక్‌రోడ్, రాజీవ్‌చౌక్‌తోపాటు పలు ఏరియాలు నగరంలోనే అత్యంత బిజీగా ఉంటాయి. కానీ, ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ కరువైంది. దీంతో పలు షాపుల యజమానులు, తమ దుకాణాల ఎదుట రెండు మీటర్ల వరకు ఆక్రమణ చేసి.. సామగ్రి నింపుతున్నారు. మరికొంత మంది తమ తమ షాపుల ఎదుట రోడ్డుపైనే మరో చిన్న వ్యాపారం పెట్టుకోవడానికి అవకాశం కల్పిస్తూ.. వారి నుంచి నెలకు ₹ఐదు వేల నుంచి ₹ఎనిమిది వేలు వసూలు చేస్తూ ట్రాఫిక్ చిక్కులు తెచ్చిపెడుతున్నారు. ఫలితంగా రాకపోకలకు ఇబ్బంది అవుతున్నది. ఎప్పుడో బుద్ధి పుట్టినప్పుడు ట్రాఫిక్ పోలీసులు వెళ్లి క్లియర్ చేస్తున్నా.. ఆ తర్వాత రెండు రోజులకే మళ్లీ యధాస్థితికి చేరుకుంటున్నది. రోడ్లన్నీ వివిధ వ్యాపారవర్గాల ఆక్రమణలతో నిండిపోతుండగా, పార్కింగ్ అస్తవ్యస్తంగా మారి సమస్య మరింత తీవ్రమవుతున్నది. దీనికి అడ్డుకట్టవేయాలని ఇదే ప్రాంతం నుంచి పలువురు యజమానులు ట్రాఫిక్ పోలీసులకు చెబుతున్నా.. ప్రజల నుంచి అసహనం వ్యక్తమవుతున్నా అది మూణ్ణాళ్ల ముచ్చటే అవుతున్నది. సమస్య ఎంత తీవ్రంగా వేధిస్తున్నదో చెప్పడానికి నిదర్శనమే 'నమస్తే తెలంగాణ' తన కెమెరాలో బంధించిన ఈ చిత్రాలు.

**- రాంనగర్, డిసెంబర్ 9 / కరీంనగర్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్**

### అన్ని చర్యలు తీసుకుంటున్నాం

మార్కెట్ ఏరియా, గంజ్, క్లాక్ టవర్ లాంటి వ్యాపార సముదాయాల్లో ఒకప్పుడు విపరీతమైన ట్రాఫిక్ సమస్య ఉండేది. ఇప్పుడు కాస్త తగ్గింది. ఇంకా తగ్గించడం కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. రోడ్లపైకి ఆక్రమణ లు చేస్తుండడంతోనే ఈ సమస్య వస్తున్నట్టు గుర్తించాం. ఆక్రమణలు తొలగింపు కోసం వ్యాపారులకు నోటీసులు జారీ చేస్తున్నాం. వారు సహకరించకపోతే జరిమానాలు కూడా విధిస్తాం. అప్పుడు కోర్టుకు వెళ్లాల్సి వస్తుంది. దీనిపై అవగాహన కల్పిస్తున్నాం. అలాగే ఫుట్‌పాత్ వ్యాపారులకు కూడా మార్కింగ్ చేశాం. కూరగాయల మార్కెట్ తరలించే దాకా కొంత ఇబ్బందులు తప్పవు. దీనిపై మున్సిపల్ అధికారులతో పలుసార్లు చర్చించాం.

**- ఎండీ సర్వర్, ట్రాఫిక్ ఏసీపీ (కరీంనగర్)**


క్లాక్‌టవర్ ఎదుట అస్తవ్యస్తంగా ట్రాఫిక్


టవర్ సర్కిల్ దిగువ గల్లీలో రోడ్లపైనే విక్రయాలు


పేషెంట్ కేర్ లేకపోవడంతో వినోద్‌కుమార్‌ను స్ట్రెచర్‌పై తీసుకొస్తున్న ఆయన భార్య

## పేషెంట్ కేర్ ఎక్కడ?

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన దవాఖానలో పేషెంట్ కేర్‌లు కరువయ్యారు. వైద్యం కోసం వచ్చిన రోగులను వీల్ చైర్లు, స్ట్రెచర్ కుటుంబ సభ్యులే తరలించాల్సి వస్తున్నది. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం పెద్దాపూర్‌కు చెందిన వినోద్‌కుమార్‌కు రెండు నెలల క్రితం కాలు విరిగింది. ఇదే దవాఖానలో శస్త్ర చికిత్స చేయగా, మంగళవారం రివ్యూ కోసం వచ్చాడు. డాక్టర్ వద్దకు తీసుకెళ్లేందుకు అక్కడ పేషెంట్ కేర్ లేకపోవడంతో వినోద్ భార్యనే స్ట్రెచర్‌ను నెట్టుకుంటూ తీసుకెళ్లింది. అక్కడే ఉన్న అదనపు ఆర్ఎంవో డాక్టర్ నవీన వెంటనే గమనించి, సిబ్బందిని పిలిచి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డిని సంప్రదించగా, ఇదే సమయంలో ఇంకో రోగికి అత్యవసర చికిత్స కావడంతో పేషెంట్ కేర్ వెళ్లారని, అయినా దీనిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని సమాధానమిచ్చారు.
– విద్యానగర్, జనవరి 9

## వరినాట్లకు వలస కూలీ

- ఉమ్మడి జిల్లాకు పశ్చిమ బెంగాల్ కూలీలు
- పొలం పనుల్లో తలమునకలు
- ఒక్కొక్కరికి రోజుకు ₹800 దాకా కూలీ
- శ్రమజీవుల్లో ఆనందం

పెద్దపల్లి, జనవరి9 (నమస్తే తెలంగాణ): తెలంగాణ వచ్చిన తర్వాత కేసీఆర్ సర్కారు వ్యవసాయాన్ని పండుగలా చేసింది. 24 గంటల కరెంట్, సాగునీరు, రైతుబంధు ఇవ్వడంతో సాగు సంబురంగా సాగుతున్నది. పుట్లకొద్దీ ధాన్యం పండుతున్నది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన ప్రోత్సాహంతో రైతులు ఎక్కడా ఒక్క ఎకరం ఖాళీ ఉంచకుండా పంటలు వేస్తుండగా, వ్యవసాయ రంగంలో ఉపాధి పుష్కలంగా పెరిగింది. ఇదే సమయంలో స్థానికంగా కూలీల కొరత కూడా ఏర్పడింది. దీంతో దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచి కూలీలు పెద్ద సంఖ్యలో కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు వస్తున్నారు. ప్రధానంగా పశ్చిమ బెంగాల్, బిహార్, ఆంధ్రప్రదేశ్ నుంచి తమ కుటుంబాలతో వచ్చి ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా వరి నాట్ల పనుల్లో తలమునకలయ్యారు. పెద్దపల్లి, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, ముత్తారం, ఎలిగేడు మండలాలకు 300 మంది తరలివచ్చి, బృందాలుగా ఏర్పడి నాట్లు వేస్తున్నారు. రైతుల వద్ద ఎకరానికి ₹3,200 నుంచి ₹3,500 చొప్పున గుత్తకు మాట్లాడుకొని చకచకా పనిచేస్తున్నారు. పెద్దపల్లి జిల్లాకు వచ్చిన కోల్‌కతాకు చెందిన కూలీలను 'నమస్తే తెలంగాణ' పలుకరించగా, తమ మనోభావాలను ఇలా ఆవిష్కరించారు. తమ రాష్ట్రాల్లో ఉపాధి అవకాశాలు తక్కువేనని, రోజంతా కష్టపడినా పెద్దగా ప్రయోజనం ఉండదని చెబుతున్నారు. ఇక్కడ మాత్రం తమకు రోజుకు ₹600 నుంచి ₹800 దాకా కూలి వస్తున్నదని మురిసిపోతున్నారు.


రాంపల్లిలో నాట్లు వేస్తున్న కోల్‌కత్తా కూలీలు

### మాకు పని సులువైతంది



బెంగాల్ కూలీలు రాబట్టి మా పని కొంచెం సులువైతున్నది. నాట్లు వేయాలంటే చాలా తిప్పలయ్యేది. ఇప్పుడు ఆ బాధ లేదు. ఊర్లళ్ల ఉన్న కూలీలు సరిపోవడం లేదు. వీళ్లు రావడం వల్ల త్వరగా నాట్లు అవుతున్నయి. మా ఊరికి ఐదు బ్యాచ్‌లు వచ్చినయి. ఇంకో ఆరేడు వస్తాయట. మూడేండ్ల నుంచి వీళ్లు వస్తున్నరు. వీళ్లు నాటేసే పద్ధతి బాగా ఉంటుంది. నాటు మంచిగా పడుతుంది. పని త్వరగా అవుతుంది. వీళ్లకు వసతి కల్పిస్తే సరిపోతుంది. వాళ్లే వండుకుంటరు.

**- కనపర్తి ప్రభాకర్‌రావు, రాంపల్లి (పెద్దపల్లి మండలం)**

### మాకు చేతినిండా పని..



మాది కలకత్తాలోని చక్‌దా ఏరియా. మా రాష్ట్రంలో కూలీ పనులు ఎక్కువ దొరుకవు. అందుకే ఇక్కడికి వచ్చి కూలీ పని చేసుకుంటున్నం. మేం 50 మందిమి వచ్చినం. ఈ నెల రోజులు మాకు చేతి నిండా పని దొరుకుతది. ఇక్కడ సంపాదించిన పైసలే మమ్ముల ఏడాదంతా కాపాడుతయి.

**- కృష్ణ, వ్యవసాయ కూలీ (కోల్‌కతా)**

### మూడేండ్ల నుంచి ఇక్కడికి వస్తున్నం



మేం ఎక్కడ ఏ కూలీ పని దొరికితే ఆ పని చేసుకుంటం. మూడేండ్ల నుంచి ఇక్కడికి వస్తున్నం. 12 రోజుల కింద 60 మందిమి వచ్చినం. 12మందికి ఒక బ్యాచ్‌గా తయారైనం. పొలాలు గుత్తకు తీసుకొని నాట్లు వేస్తున్నం. మాకు ఎకరానికి ₹3,200 ఇస్తున్నరు. రోజుకు మూడు, నాలుగు ఎకరాలు వేస్తున్నం. మాకు ఒక్కరికి రోజుకు ₹800 దాకా దొరుకుతున్నయి.

**- అశోక్ సర్దార్, వ్యవసాయ కూలీ (కోల్‌కతా)**

## 20న నవోదయ ప్రవేశ పరీక్ష

- ఉమ్మడి జిల్లాలో 36 సెంటర్లు
- పరీక్ష రాయనున్న 7105 మంది విద్యార్థులు
- చొప్పదండి నవోదయ స్కూల్ ప్రిన్సిపాల్ మంగతాయారు

చొప్పదండి, జనవరి 9: జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25లో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 20న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ మంగతయారు తెలిపారు. శనివారం ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 1: 30 వరకు పరీక్ష ఉంటుందని, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఏమైనా ఇబ్బందులు ఎదురైతే 9490395216, 9966759402, 9030426686 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు ఆమె మంగళవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. 80 సీట్లకు గానూ 7105 మంది విద్యార్థులు పోటీ పడుతున్నారని, కరీంనగర్ జిల్లావ్యాప్తంగా 36 సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులో కులం కేటగిరీ, అర్బన్, రూరల్ పుట్టిన తేదీ జెండర్ నమోదులో తప్పిదాలు ఉంటే అన్ని ఆధారాలతో ఈ నెల 16లోగా చొప్పదండి నవోదయ పాఠశాలలో సంప్రదించి సరిచేసుకోవాలని కోరారు. బ్లాక్, మీడియంలో తప్పులు సవరణకు అవకాశం లేదన్నారు. పారదర్శకంగా విద్యార్థులను ఎంపిక చేస్తామని, దళారులను ఆశ్రయించి మోసపోవద్దని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు.

## ట్రాఫిక్ ఎవేర్‌నెస్ పార్కు పేరు మార్పు

హైదరాబాద్, జనవరి 9(నమస్తే తెలంగాణ) : కరీంనగర్ జిల్లా ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలోని 'శ్రీ కృష్ణమనేని వెంకట రామారావు ట్రాఫిక్ ఎవేర్‌నెస్ పార్క్' పేరును 'జువ్వాడి చొక్కారావు ట్రాఫిక్ ఎవేర్‌నెస్ పార్క్'గా మార్చుతూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మార్పు తక్షణమే అమల్లోకి వస్తుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

## మిల్లర్ల మాయాజాలం

- సీఎంఆర్ ఇవ్వడంలో నిర్లక్ష్యం
- వడ్లు అమ్ముకుంటూ అక్రమార్జన
- విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీల్లో అక్రమాలు బహిర్గతం
- ఓ మిల్లర్ అరెస్ట్ వెనుక పెద్ద తతంగం
- అధికారుల నోటీసులూ లెక్క చేయని వైనం

**కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఇవ్వడంలో మిల్లర్ల మాయాజాలం బయటపడుతున్నది. ప్రభుత్వం ఇచ్చిన వడ్లకే ఎసరు పెట్టి కొందరు కోట్లు దండుకుంటున్నట్లు వెలుగులోకి వస్తున్నది. ఇప్పటికే పౌర సరఫరాల సంస్థ అధికారులు జమ్మికుంట మిల్లర్లపైన కేసులు పెట్టగా, శంకరపట్నం మండలంలో ఒక మిల్లర్‌ను రిమాండ్‌కు తరలించడం సంచలనం రేపుతున్నది. మరోవైపు ఈ నెలాఖరులోగా లక్ష్యం మేరకు సీఎంఆర్ ఇవ్వడం అనుమానమేనని తెలుస్తున్నది. ఈ పరిణామాల నేపథ్యంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మూడు రోజులపాటు తనిఖీలు చేయగా, అడ్డదారులు తొక్కిన మిల్లర్లలో వణుకుపుడుతున్నది.**



కరీంనగర్, జనవరి 9 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట, హుజూరాబాద్, మానకొండూర్, సదాశివపల్లి, తిమ్మాపూర్, కరీంనగర్ చుట్టు పక్కల రైస్ మిల్లులు ఎక్కువగా ఉన్నాయి. ప్రతి వానకాలం, యాసంగి సీజన్లలో ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొంటున్న ప్రభుత్వం, పైసా ఖర్చు లేకుండా మిల్లులకు కస్టం మిల్లెడ్ రైస్ (సీఎంఆర్) పేరిట సరఫరా చేస్తున్నది. ఇదే అదునుగా కొందరు మిల్లర్లు అడ్డదారులు తొక్కారు. బియ్యాన్ని తిరిగి ఇవ్వకుండా నేరుగా ధాన్యాన్నే అమ్ముకొని సొమ్ము చేసుకునే స్థాయికి దిగజారారు. ఇటీవల జమ్మికుంట, హుజూరాబాద్ ప్రాంతంలోని ఏడు మిల్లుల్లో తనిఖీ చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, అక్కడ జరుగుతున్న తతంగం చూసి ఏకంగా విస్తుపోయారు. ప్రభుత్వం కేటాయించిన ధాన్యం మాయమైనట్టు గుర్తించారు. జమ్మికుంటకు చెందిన ఒక మిల్లర్ అక్రమాలను చూసిన ఆశ్చర్యపోయారు. ఈ ఒక్క మిల్లులోనే దాదాపు 4 లక్షల క్వింటాళ్లకు పైగా ధాన్యం లోటును గుర్తించినట్టు తెలిసింది. రెండు మూడు రోజుల కింద శంకరపట్నం మండలం మొలంగూర్‌లోని ఒక మిల్లులో కూడా ఇలాంటి బాగోతమే బయటపడింది. దాంతో జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ రజనీకాంత్ బాధ్యుడిపై కేసు పెట్టాల్సి వచ్చింది. ఇదిలా ఉంటే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నాలుగైదు రోజులుగా వరుస తనిఖీలు చేసినట్టు తెలుస్తున్నది. ముఖ్యంగా కరీంనగర్‌లోని రెండు, మానకొండూర్ మండల కేంద్రంలోని రెండు, తిమ్మాపూర్ మండలం రేణికుంటలోని మరో రెండు రైస్ మిల్లుల్లో సోదాలు చేసినట్టు తెలిసింది. ఈ మిల్లుల్లోనూ ప్రభుత్వం కేటాయించిన ధాన్యం పూర్తిస్థాయిలో లేదని దృష్టికి వచ్చినట్లు తెలుస్తున్నది. అయితే, మొలంగూర్‌కు చెందిన ఒక మిల్లర్‌పై కేసు నమోదు చేసిన అధికారులు మిగతా మిల్లర్లపైనా ఎందుకు చేయలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు విక్రయం?

ప్రభుత్వం మిల్లులకు కేటాయిస్తున్న ధాన్యం ఏమైందనే చర్చ జోరుగా సాగుతున్నది. కొందరు మిల్లర్లు నిజాయితీగా సీఎంఆర్ ఇస్తున్నా.. మరికొందరు మాత్రం అక్రమాలకు పాల్పడుతుండడం మొత్తం వ్యవస్థకే చెడ్డ పేరు తెస్తున్నది. నిజానికి గతంలో మిల్లర్లు బియ్యం మరాడించిన తర్వాత సీఎంఆర్ ఇవ్వకుండా అమ్ముకోవడమో, పీడీఎస్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి సీఎంఆర్ కింద ఇవ్వడమో చేసేవారు. కానీ, ఈ సారి మాత్రం ఏకంగా ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్నే అమ్ముకునే స్థితికి చేరారు. బియ్యం కంటే ధాన్యం అమ్మితేనే ఎక్కువ అక్రమార్జన వస్తుందని భావించి ఈ విధంగా ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు అక్రమంగా ధాన్యాన్ని తరలించి విక్రయించినట్లు తెలుస్తున్నది. ఇంత దారుణంగా అమ్ముకోవడం చర్చనీయాంశంగా మారింది.

### గడువులోగా అనుమానమే

2022-23 వానకాలం సీజన్‌కు సంబంధించి జిల్లా, ఇతర జిల్లాల రైతుల నుంచి సేకరించిన 2,96,900.440 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లుల కెపాసిటీని బట్టి కరీంనగర్ జిల్లాలోని దాదాపు అన్ని మిల్లులకు కేటాయించారు. గడువులోగా సీఎంఆర్ ఇవ్వాల్సి ఉన్నా.. మిల్లర్ల సాకులు నమ్మి అధికారులు గడువు పొడిగిస్తూ వస్తున్నారు. ఇప్పటి వరకు 1,99,901.890 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే ప్రభుత్వానికి ఇచ్చారు. ఇంకా 34,863.690 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉండగా.. గత డిసెంబర్ 31 వరకే ఉన్న గడువును ఈ నెలాఖరు వరకు పెంచారు. ఇక 2022-23 యాసంగి సీజన్‌లో చూస్తే జిల్లా, ఇతర జిల్లాల నుంచి 3,74,825.280 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి మిల్లులకు అందించారు. 2,53,634.580 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటి వరకు 60,088 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే ఇచ్చారు. ఇంకా 1,93,544 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఇవ్వాల్సి ఉంది. దీనికి కూడా ఈ నెల 31 వరకే గడువు ఉంది. ఇంత తక్కువ సమయంలో ఇంత పెద్ద మొత్తంలో బియ్యాన్ని ఏ విధంగా ఇస్తారనేది అనుమానంగానే ఉన్నది.

## ₹25 లక్షలు ఇస్తవా.. లేదా?

- లేకుంటే అవినీతి చేసినట్టు సీఎంకు ఫైల్ పంపుతం
- ఓ అధికారికి నలుగురి బెదిరింపు
- ముగ్గురిని రిమాండ్ చేసిన పోలీసులు

ఇల్లందకుంట, జనవరి 9: '₹25 లక్షలు ఇవ్వు. లేకుంటే నీవు అవినీతి అక్రమాలు చేసినట్టు ఫైల్ తయారు చేస్తం. ముఖ్యమంత్రికి పంపిస్తం' అంటూ ఓ అధికారిని నలుగురు వ్యక్తులు బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పరారులో ఉన్న మరొకరి కోసం గాలిస్తున్నారు. ఇల్లందకుంట ఎస్ఐ రాజ్‌కుమార్ వివరాల ప్రకారం.. మండలంలోని పాతర్లపల్లి గ్రామానికి చెందిన అబ్బిడి సురేందర్‌రెడ్డి, జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా మొగలపల్లి మండలం గుండ్లకర్తి గ్రామానికి చెందిన రియాజ్, కుమారస్వామి, సురేశ్ స్నేహితులు. వీరంతా కలిసి హైదరాబాద్‌లోని ఓ అధికారికి ఈ నెల 4, 5 తేదీల్లో ఫోన్ చేసి ₹25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకుంటే అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు ఫైల్ తయారు చేసి, సీఎంకు పంపిస్తామంటూ బెదిరించారు. దీంతో సదరు అధికారి ఈ నెల 6న ఇల్లందకుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు ఫోన్ కాల్ ఆధారంగా దర్యాప్తు చేసి, ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేసి రిమాండ్‌కు పంపించారు. ఈ కేసులో మరో నిందితుడు సురేశ్ పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

**మరిన్ని జిల్లా వార్తలు 8లో..**